# ఖైదీ-కొమరయ్య

కొమరయ్యా అబ్బాయికి టిఫిన్‌కారియరు తీసుకువెళ్లే వేళయింది. లేవరా! చంచాతో బాబుకు అన్నం తినిపించి, క్లాసులోకి పంపించు" ''అమ్మగారు'' నీరసంగా మూలిగి లేచి వచ్చాడు.

''అదేమిట్రా అట్లాఉన్నావు? ఇంత సేపేంచేస్తున్నావు?'' గొంతెత్తి గట్టిగా అరిచింది శకుంతల.

''రాత్రినుంచీ జ్వరంకాస్తోంది అమ్మగారూ. తలపగిలి పోతున్నట్టుగాఉంది. పడుకునేఉన్నా'' ఎర్రబడ్డ కళ్లను నలుపుకుంటూ అన్నాడు.

''ఏమిటీ రాత్రినుంచీజ్వరం కాస్తోందా? స్కూలుకు వెళ్ళమంటే ఏదో ఒకటి చెప్తావురా? బాబేమో చిన్నవాడు. కారియల్ తెరచి అన్నం తీసుకు తినలేడు. గుంపులో క్లాసులోకి వెళ్లలేడు. నీవు వెళ్ళి అన్నంతినిపించిరావాలి. అక్కడినుంచి రాగానే నీకు అన్నంపెడతాను తిని మాత్రవేసుకునిపడుకో. బద్ధకించకువెళ్ళు'' ఆమె టిఫిన్‌కారియరు పెట్టినబుట్ట పట్టుకుని నిలబడ్డది.

కొమరయ్య ఒక చేత్తో బుట్టపట్టుకుని, మూలుగుతూ బయలుదేరాడు. జర్వం పేలిపోతున్నది రోడ్డుకుపక్కగా నడుస్తున్నాడు కాళ్లతడబడుతున్నాయి. ఒళ్లునొప్పులు తూలుతూనడుస్తున్నాడు.

స్కూలు ఇంటికి రెండుఫర్లాంగుల దూరముంది. అడుగులు వేసుకుంటూ నడుస్తున్నాడు. "ఇంకాకాస్తనడిస్తే స్కూలువచ్చేస్తుంది" అనుకుంటూ, మధ్యమధ్య ఆగుతూ పోతున్నాడు. కాని - స్కూలు ఇంకా పదిగజాలదూరం ఉందనగా కొమరయ్యకు కళ్లు చీకట్లుకమ్మాయి. "రోడ్డువారగా పడిపోయాడు చేతిలోఉన్న బుట్టి కిందపడిపోయింది. టిఫిన్‌కారియరు దొర్లుకుంటూపోయి తెరుచుకుంది. అన్నం పెరుగూ కిందపడ్డాయి. కొమరయ్య ఒళ్ళు తెలియకుండా పడిఉన్నాడు.

"ఈపాటికి కొమరయ్య స్కూలుకువెళ్ళి బాబుకు అన్నం తినపించి ఉంటాడు"

"ఈవేళకు క్లాసులోకి పంపించి ఉంటాడు."

"కొమరయ్యరాగానే బాబు ఏడవకుండా క్లాసులోకి వెళ్లాడోలేదో అడగాలి" వాకిట్లో నిలబడ్డది శకుంతల.

గంట-రెండు గంటలు దాటిన తరువాత-

"బాబును మూడుగంటలతరువాత తీసుకునే ఇంటికి వస్తాడేమో?"

ఆమెకు నిద్రమత్తుగాఉంది లోపలికివెళ్ళి పడుకుంది.

నాలుగయింది.

"మూడుగంటలవరకే స్కూలు ఈ పాటికి రావలసిందే అబ్బాయి నడవ లేడు. ఎత్తుకుని మెల్లిగా నడిచివస్తున్నాడేమో?"

గొణుక్కుంటూ లేచి వాకిటి గుమ్మంలో నిలబడ్డది.

ఐదుగంటలకు అబ్బాయి తండ్రి భాస్కరరావు గేటు తెరచుకుని స్కూటరు నడిపించుకుంటు వచ్చాడు.

''ఇక్కడ నిలబడ్డావేం?''

''కొమరయ్య అబ్బాయిని తీసుకుని ఇంకారాలేదు.'' ఆదుర్దాతో అంది శకుంతల ముఖం చిన్నబుచ్చుకుని.

''ఐదుగంటలు దాటినా రాలేదా? ఈ పాటికి అందరూ ఇళ్ళకు వెళ్ళిపోయి ఉంటారు. నేను చూసివస్తాను'' భాస్కరరావు స్కూటరుమీద బయలుదేరాడు. స్కూలు గేటుముందరే వాచ్‌మన్ కనుపించి ''పిల్లలందరూ వెళ్ళిపోయారు'' అన్నాడు.

''లోపల ఎవరున్నారు? అబ్బాయి ఇంకా ఇంటికిరాలేదు''

''మేడమ్ ఆఫీసురూములోఉన్నారు. లోపలికివెళ్ళండి'' ఆయనను లోపలికి తీసుకువెళ్లాడో లేదో బాబు "నాన్నా" అంటూవచ్చి కాళ్ళకు చుట్టుకున్నాడు.

''వీడింకా ఇంటికిరాలేదని వచ్చాను మేడమ్'' అన్నాడు భాస్కర్రావు ఆమె ఏమిటి అనేలోపల.

''ఇతడు మీ అబ్బాయా? ఇవాళ నౌకరు రానట్టున్నాడు. క్లాసు టీచరు భోజనంవేళకు బిస్కెట్లు రొట్టె ఇచ్చిందట. ఇంటికి వెళ్ళేటప్పుడు నాకు ఒప్పగించింది తీసుకువెళ్ళండి ఆకలేస్తున్నదేమో?'' అన్నది కుర్చీమీదినుంచిలేస్తూ.

స్కూటరుదిగి ఇంట్లోకి పరుగెత్తుకుంటూవచ్చిన బాబునుగుండెకుహత్తుకుని ముద్దుపెట్టుకుంది శకుంతల. లోపలికితీసుకువెళ్ళి పాలుతాగించి టిఫిన్ పెట్టింది.

''ఇంత ఆలస్యమెందుకయింది? కొమరయ్యరాలేదా? మధ్యాహ్నం అన్నం పెట్టాడా?'' ఒళ్లోకూర్చోబెట్టుకుని అడుగుతోంది శకుంతల బాబు తలనిమురుతూ.

''లేదు మరేమో టీచరు బిస్కెట్లు రొట్టె ఇచ్చింది'' బుంగమూతి పెట్టాడు బాబు.

''కొమరయ్య స్కూలుకు వెళ్ళలేదన్నమాట. వెళ్ళేటప్పుడే నసుగుతూ వెళ్లాడు ఎటువెళ్లాడో? మరీ ఇప్పుడు మాటవినిపించుకోవటంలేదు. పోతే పోనీయండి కడుపునిండాఅన్నందొరికితే వాళ్ళబుద్ధులుఇట్లాగేఉంటాయి'' అంటోంది శకుంతల భాస్కర్రావు గదిలోకి వెళ్ళేసరికి.

''వాడిని ఊరినించి మనం తీసుకువచ్చాం. వాడూ మనబాబువంటివాడేనను కోవాలి వాడి బాధ్యత మనదే. అలా బజారుకెళ్ళి చూసివస్తాను'' భాస్కర్రావు బయలుదేరుతుంటే ''కాఫీ అయినా తాగివెళ్ళండి'' అంది శకుంతల.

కొమరయ్య ప్రతిరోజు ఏదారిన స్కూలుకువెళ్తాడో అతడికితెలుసు. ఆదారినే స్కూటరుమీదవెళ్తూ దారిపొడుగునా ఉన్న దుకాణాలలో కొమరయ్యను గురించి అడిగాడు ''రద్దీవేళ-మేము చూడలేద''ని చెప్పారంతా. కాని-చివరికి దుకాణంలో నుంచి స్కూటరుచూడగానే ఒక పిల్లవాడు బైటికివచ్చాడు.

''కొమరయ్య

కోసమానండీ, మధ్యాహ్నం బుట్టపట్టుకుని నడుస్తూ అక్కడ-రోడ్డు పక్కన పడిపోయాడు. బుట్టఅంతదూరానపడ్డది నేనుచూశాను లేచివెళ్తాడుకదా అనుకున్నా.

తరువాతచూస్తే అన్నమంతా కిందపడిపోయింది. బుట్టా టిఫిన్‌కారియరూ అక్కడ లేవు కొమరయ్య కనబడలేదు'' అన్నాడు-నడుంమీద చేతులుపెట్టుకుని.

అంతలో దుకాణంసేటు లేచివచ్చి ''పడిపోయాడండీ. వీధిలో నలుగురూ పోగయి ''ఒళ్లు కాలిపోతోంది ఆస్పత్రికి తీసుకువెళ్లే రిక్షాతీసుకురండిరా'' అని ఎక్కించుకునివెళ్ళారు నేను చూస్తునేఉన్నాను'' అన్నాడు.

"ఏ ఆస్పత్రో తెలుసా?"

"తెలియదండి"

హాస్పిటల్లో చేర్చారని వినగానే భాస్కరావు మనసు కొంతశాంతించింది. ఆ పని తను చెయ్యవలసింది గుండెలో ముల్లుగుచ్చినట్లయింది. జర్వం తగ్గగానే ఇంటికివస్తాడుకదా అనుకున్నాడు. ఇంటికివెళ్ళగానే శకుంతలతో చెప్పాడు-"మనం చెయ్యవలసినపని వీధిలోవాళ్లు చేశారని" విచారంతో.

గవర్నమెంట్ హాస్పిటల్లో మంచంమీద ఒళ్లుతెలియకుండా పడున్న కొమరయ్య రాత్రి ఎనిమిదిగంటలకు కళ్లు తెరచాడు. దాహమనిపించింది లేవలేక మంచంమీద వాలిపోయాడు.

నర్సు మందు తీసుకువచ్చింది అరగంట తరువాత.

''నన్నెవరు తీసుకొచ్చారిక్కడికి?'' మాట సరిగా రావటంలేదు గొంతు ఆరిపోయింది నీరసించిపోయాడు.

"ఎవరో తీసుకొచ్చారని వార్డుబాయ్ చెప్పాడు. డాక్టరు మందివ్వమన్నారు. నోరు తెరు"

కొమరయ్య మందుతాగి, పక్కకుతిరిగి పడుకున్నాడు. ఆ మరునాడుజ్వరం కొంచెం జారింది. డాక్టరు మందులు కేస్‌షీట్‌లోరాస్తూ "నీ పేరేమిటి?" అడిగాడు.

"కొమరయ్య"

''మీ నాయన ఏంచేస్తాడు?''

''నాయనలేడు అమ్మ ఊళ్ళో ఉంటుందండి. ఇక్కడ నేను ఒక బాబు గారింట్లో ఉంటున్నానండి''

"ఎలా వచ్చావిక్కడికి?"

''నాకు తెలియదండి చిన్న బాబును స్కూలుకు తీసుకెళ్ళానండి ఇంటి కొచ్చి మధ్యాహ్నం భోజనం బుట్ట తీసుకెళ్తుంటే చీకటనిపించిందండి. మరి-తరువాత ఏమయిందో తెలవదండి''

''నీ విక్కడ ఇంకా రెండురోజులుండు జ్వరంతగ్గిన తరువాత బలానికి మాత్రలు ఇస్తాము. ఉంటావా''

''అక్కడ పని చెయ్యాలండి అమ్మగారు........''

''అయినా ఉండాలి''

"సరేనండి"

డాక్టరు నర్సుతో ఇంగ్లీషులో చెప్తున్నాడు-"పనికి పిల్లలను పెట్టుకుంటారు-కాని-ఎంత హీనంగాచూస్తారోచూడు. వీడికి పేరాటైఫాయిడ్ ఈ మందులు ఆహారం జాగ్రత్తగా ఇవ్వు'' అని.

తననుగురించే చెప్తున్నాడని కొమరయ్య గ్రహించాడు కాని అర్థంకాలేదు.

రెండురోజులతరువాత తనను పంపిచేస్తారనుకున్నాడు. కాని-నర్సు ఆమాట చెప్పకుండా మందులిచ్చి వెళ్తోంది. డాక్టర్లువచ్చి చూస్తున్నారు. కేస్‌షీట్లు రాస్తున్నారు కాని - ఇంటికి పంపిస్తామని ఎవరూ అనటంలేదు కొమరయ్యకు అడగటానికి భయంగాఉంది.

వారంగడిచింది నర్సు వచ్చినప్పుడు అడిగాడు ''నన్ను ఇంటికి పంపించరూ?'' అని.

"నీకిక్కడ బాగా లేదా ? ఇంటికి వెళ్ళి ఏం చేస్తావు ? పని చెయ్యాలా ? డాక్టరు చెప్పేవరకూ ఉండు" అన్నది.

"అది కాదండి, నేను పనిచేస్తేకదా. అయ్యగారు డబ్బిచ్చేది ? ఊరికి డబ్బు పంపాలికదండీ ?''

''ఎవరికి ? మీ అమ్మకా ?''

"కాదండి, రాజుగారికి.''

"ఆయన కెందుకు ?"

"బాకీ ఉన్నామని అమ్మ చెప్పిందండి."

''డాక్టరు గారికి నేను చెప్తాలే.''

''మర్చిపోకుండా చెప్పండి. లేకపోతే అమ్మగారు పనిలోనుంచి తీసేస్తారండి."

"తీసేస్తే ఇంకోచోట దొరకదా ?''

"మా అమ్మ అయ్యగారింట్లో ఉంచిందండి.''

"ముందు ఈ మాత్రవేసుకుని పడుకో'' నర్సు వెళ్ళిపోయింది.

మరోవారం గడిచిన తరువాత డాక్టరు వచ్చినప్పుడు కొమరయ్య అడిగాడు- ''నేను ఇంటికి వెళ్ళనాండి. ఇన్ని రోజులు ఇక్కడ ఉండిపోతే అమ్మగారు కోప్పడతారండి."

"వెళ్ళచ్చులే, వెళ్లేటప్పుడు నర్సు ఇచ్చినమాత్రలు రోజూ వేసుకో. నేను మళ్ళీరేపు వస్తాను" ఆయన వెళ్ళేవరకూ చూశాడు కొమరయ్య ''వీళ్ళంతా ఎంత మంచివాళ్ళు? ఊరికే మందులిస్తున్నారు. తనకు పాలురొట్టె పండ్లూ ఇస్తున్నారు'' అనుకున్నాడు.

అది జనరల్ వార్డు. ఆ హాల్లో వరసకు పన్నెండు మంచాలున్నాయి. అందరికీ మందులు, పాలూ రొట్టె ఇస్తున్నారు. ఇక్కడ హాయిగా ఉంది. కాని, ఇంటికి వెళ్లాలి అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

సాయంత్రం కాగానే రోగుల బంధువులందరూ మంచాల దగ్గరికి మాట్లాడటానికి వస్తారు. తనతో ఎవరూ మాట్లాడరు తన దగ్గరకెవరూ రారు. అమ్మలేదుగా ఇక్కడ అనుకుంటాడు ముఖం చిన్నబుచ్చుకుని కొమరయ్య.

రెండురోజులయిన తరువాత డాక్టరు వచ్చి "నీవు ఇంటికి వెళ్ళాలని తొందరపడుతున్నావు కదూ ! ఇవాళ వెళ్ళు. నేను చెప్పినట్లు నర్సు ఇచ్చినమాత్రలు మర్చిపోకుండా వేసుకో'' అంటూ వెళ్ళిపోయాడు. తరువాత నర్సు వచ్చి మాత్రలు పొట్లంకట్టి ఇచ్చింది.

"వీటిని జాగ్రత్తగా వేసుకో. తడవనీయకు" అంది.

తల ఊపుతూ పొట్లం జేబులో పెట్టుకున్నాడు. తనకిచ్చిన బ్రెడ్ పాలు తీసుకున్నాడు. తను వెళ్తున్నట్టుగా నర్సుకు చెప్పాడు.

హాల్లోనుంచి బైటికి వచ్చాడు ఎంతమందో వస్తున్నారు. ఎంతోమంది బైటికి వెళ్తున్నారు. గేటయితే దాటి బైటికి వచ్చాడుగాని ఎటుపోవాలో కొమరయ్యకు తెలియలేదు. మెల్లిగా ఇటు అటూ చూసుకుంటూ కార్లనూ బండ్లనూ తప్పించు కుంటూ నడుస్తున్నాడు.

కొమరయ్యకు పన్నెండేళ్ళు ఉంటాయి. తల్లి మొదట రాజుగారింట్లో పనికి పెట్టింది. అక్కడ చిన్న చిన్న పనులుచేస్తూ ఉండేవాడు. రాజుగారి చిన్న కొడుక్కి కోపం ఎక్కువ. ప్రతి చిన్నవిషయానికీ కొడుతూ ఉండేవాడు. ఒక నాడు కోపం వచ్చి మెట్లమీధ ఉన్న కొమరయ్యను కొట్టాడు. ఆ దెబ్బకు అదిరి పోయిన కొమరయ్య మెట్లమీదినుంచి దొర్లుకుంటూ కిందపడ్డాడు. పెదవులు చిట్లి రక్తం కారటం మొదలుపెట్టింది. మోకాళ్ళు కొట్టుకుపోయాయి. అందుచేత పది హేనురోజులు ఇంట్లోనే ఉండిపోయాడు.

శకుంతల పుట్టింటికి వెళ్ళినప్పుడు తల్లితో ఒక పిల్లవాడు బాబును స్కూలుకు తీసుకువెళ్ళటానికి కావాలని చెప్పింది. ఆ సంగతి బాలమ్మకు తెలిసి కొమరయ్యను వాళ్ళతో పంపించింది.

"పని చేయించుకుని అన్నం బట్ట ఇచ్చి, ముప్పయి రూపాయలు నాకు పంపిస్తే రాజుగారిబాకి కింద చెల్లిస్తాను. ఎప్పుడైనా మీరు వచ్చినప్పుడు తీసుకువస్తే వారం రోజులు ఉంచుకుని పంపిస్తాను" అన్నది.

మొదట్లో కొమరయ్యకు కొత్తపని కొత్తూరు నచ్చాయి. బాబును ఆడిస్తూ తనుకూడా ఆడుకుంటూ ఉండేవాడు. అమ్మగారు పెట్టిన అన్నంతిని, చెప్పిన పని హుషారుగా చేసేవాడు. కాని, రాను రాను విసుగుపుట్టింది. శకుంతల పనిచేస్తున్న వాడిని పిలుస్తూఉండేది. చేస్తున్నపని వదిలిపెట్టి ఇంకొక పని చెయ్యమనేది. "ఏ పనీ సరిగా చెయ్యవురా'' అంటూ కోప్పడేది, ''బాబు ఏడిస్తే", కొట్టావా? అంటూ చెవులు పిండేది. కొమరయ్య అటువంటివన్నీ సహించలేక ముఖం ముడుచుకుని కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ ఉండేవాడు.

ఇప్పుడా యింటికి వెళ్ళటానికి అతడికి మనసు ఒప్పటంలేదు. కొమరయ్య మెల్లగా ఆలోచించుకుంటూ నడుస్తుండగా పన్నెండుగంటలు దాటాయి. కడుపులో ఆకలివల్ల ఒక చెట్టునీడన ఇటూ అటూ చూస్తు కూర్చున్నాడు. అప్పుడే ఒక రిక్షా వాడు రిక్షాను చెట్టుకింద పెట్టి, కొమరయ్యను చూస్తూఉండమని రోడ్డుదాటి సందులోకి వెళ్ళాడు. కొమరయ్యకు నీరసంగా ఉంది. ఒళ్ళంతా చెమటపట్టింది. రిక్షావాడు రాగానే "ఎక్కడైనా రొట్టె చాయి దొరుకుతుందా ?'' అడిగాడు.

''రోడ్డు దాటగానే సందులో చిన్న హోటలుంది. నేనక్కడికే వెళ్ళి వస్తున్నాను'' అన్నాడు.

కొమరయ్య అతడు చెప్పిన హోటల్‌కి వెళ్ళి రొట్టె చాయ్ కావాలని అడిగాడు.

యజమాని అతడిని చూసి ''డబ్బులు తెచ్చావా ?'' అడిగాడు.

''నా దగ్గర డబ్బుల్లేవు, నేను ఆస్పత్రినుంచి వస్తున్నాను''.

"డబ్బు లేకపోతే చాయ్ రొట్టె ఎట్లా వస్తుంది ? వెళ్ళు వెళ్ళు" అన్నాడు.

''నాకు ఇక్కడ ఎవరూ లేరు, చాలా ఆకలిగా ఉంది. ఒక్క రొట్టెముక్క ఇవ్వండి బాబయ్యా'' ప్రాధేయపడ్డాడు కొమరయ్య.

"నా దగ్గర పనిచేస్తావా ? చాయ్ గ్లాసులూ, ప్లేట్లు కడగాలి. అన్నం పెట్టినప్పుడు తినాలి, చాయ్ రొట్టెకూడా ఇస్తాను. రాత్రిళ్ళు ఈ బల్లమీద పడుకోవాలి" అన్నాడు.

''మరి, డబ్బులివ్వరా బాబయ్యా, నాకు బట్టల్లేవు. ఒంటిమీద ఉన్న దొక్కటే జత'' తలవంచుకుని అడిగాడు కొమరయ్య.

"నీపని కొన్నాళ్ళు చూసి చెబుతా, అంతవరకూ చేస్తూ ఉండు'' యజమాని రెండు పూటలు అన్నం, రెండు పూటలు రొట్టె చాయ్ ఇచ్చేవాడు. కొమరయ్య ఆడుతూ పాడుతూ యజమాని చెప్పినట్టు గ్లాసులూ పళ్ళేలు కడుగుతూ ఉండేవాడు. తడిక కింద ఉన్న బల్లమీద పడుకునేవాడు.

రెండు మూడు నెలలు గడిచాయి. యజమాని జీతం సంగతి ఎత్తలేదు.

మారు బట్టలు లేవు. పొద్దున లేవగానే చొక్కా విడిచి గోచిపెట్టుకుని, నిక్కరు ఉతుక్కునేవాడు. అది ఆరీ ఆరకముందే నిక్కరు వేసుకుని చొక్కా ఉతుక్కునే వాడు. అట్లా తడిపొడి బట్టలువేసుకుని గ్లాసులు పళ్ళేలు కడిగి గిరాకీదారులకోసం బల్లమీద బోర్లించేవాడు.

గిరాకీదారులు రాగానే ''కూర్చోండి, మీకేం కావాలి ?'' అని అడిగి, యజమానికి చెప్పేవాడు. యజమాని చెప్పినట్టుగా చాయ్ కప్పులు రొట్టెతో పళ్లేలు వాళ్ళకందించేవాడు.

''ఒరే అబ్బాయి, నీ పేరేమిటి ? చాలా చురుగ్గా పనిచేస్తున్నావే ?"అంటూ వచ్చిన వాళ్ళంతా అతడిని మెచ్చుకుంటూ ఉంటే పొంగిపోయేవాడు.

పగలు పన్నెండు గంటల వరకూ పనిచేసి అన్నంతిని బల్లదగ్గరగా పడుకున్నాడు కొమరయ్య. ఆ వేళప్పుడు ఎక్కువగిరాకీ ఉండదు. యజమాని కూడా తన సీట్లోంచి లేచి అప్పుడే లోపలికి వెళ్ళాడు. రెండు మూడు గంటలనుంచీ మళ్ళీ గిరాకీదార్ల సందడి ఎక్కువవుతుంది.

సాయంత్రం ఐదు గంటలకు యజమాని గల్లాపెట్టెలో ఉన్న చిల్లర లెక్క చూసుకుందామని పెట్టె తెరిచాడు.

పెట్టె ఖాళీగా ఉంది.

కంగారు పడుతూ యజమాని ఇంట్లోకి బైటికీ తిరిగాడు. లోపల్నించి రాగానే కనబడ్డ కొమరయ్యను "ఏంరా ? గల్లాపెట్టె తెరిచావా ? దాంట్లో వేసిన డబ్బు లేమయ్యాయి ?'' గావుకేకలు పెట్టాడు....

''నేను చూడలేదు బాబయ్య'' బిక్కముఖం పెట్టాడు కొమరయ్య. అతడు అప్పటివరకూ గ్లాసులు ప్లేట్లు కడుగుతూ తడిసిన బట్టలను పిండుకుని, గాలికి ఆరపెట్టుకుంటున్నాడు బైటనిలబడి

''నీవు కాకపోతే ఎవరున్నారిక్కడ ?" రంకెలు పెడుతూ యజమాని దగ్గరగా వస్తున్నకొద్దీ కొమరయ్యకు తన్ను కొడతాడేమోనని భయం పుట్టి పరుగెత్తాడు. "వీడి పనే అయిఉంటుందని'' యజమాని వెంబడించాడు.

కొమరయ్య కాలికొద్దీ పరుగెత్తాడు. అలిసిపోయి ఒక చోట నిలబడ్డాడు. అది యజమానికి కనబడని చోటుకదా అనుకున్నాడు. బలిష్ఠుడైన యజమాని ముందుకువెళ్ళి, మళ్ళీ వెనక్కు దిరిగాడు. చెట్టుచాటుకు కొమరయ్య చొక్కా కన బడ్డది.

చొక్కా పట్టుకుని బైటికిలాగి ''డబ్బుతీసుకుని పారిపోతావా ?'' అంటూ అతడి జేబులు వెతికాడు, డబ్బు కనబడలేదు. ఆ కోపాన్ని పట్టలేక చేతులునొప్పి పెట్టేవరకు కొట్టి, అదగ్గరలో ఉన్న పోలీసుస్టేషన్‌లోకి లాక్కెళ్ళాడు.

''వీడు వట్టి దొంగండి. నేను చాయ్ అమ్ముకున్న డబ్బులు గల్లాపెట్టెలో వేసుకుంటాను. వాటిని కాజేస్తున్నాడండి. ఎన్నాళ్ళని ఊరుకోను? నేనూ పేద వాణ్ణి, నాలుగు డబ్బులు మిగులుతాయని కష్టపడుతుంటే వీడు మాయం చేస్తు న్నాడు" అంటూ ఆయాసపడుతూ చెప్పాడు.

కొమరయ్యకు అక్కడా బాగా దెబ్బలుతగిలాయి. ఒళ్ళంతా వాతలు తేలాయి. అతడు ఏం చెప్పినా పోలీసులు వినిపించుకునే స్థితిలో లేరు. రెండు రోజులపాటు అతడిచేత నిజం చెప్పించాలని ప్రయత్నించారు. చివరకు బాలనేర స్థుల శాఖకు పంపించారు.

కొమరయ్య ఊళ్ళో ఉన్నప్పుడు అక్షరాలూ అంకెలూ చెట్టుకింద చదువు చెప్పే పంతులు దగ్గర నేర్చుకున్నాడు. రాజుగారి బాకీకోసం తల్లి ''మనకు చదు వెందుకురా'' అని వాళ్ళింట్లో పనికి కుదిర్చింది.

బాలనేరస్థులకు వయసుకు తగిన పని, చెట్లకు నీళ్ళుపొయ్యటం, తవ్వటం ఊడవటంతోపాటు చదువుకూడా నేర్పుతారు. అక్కడ పని తప్పించుకుని తిరగ టానికి వీలులేదు. పారిపోవటానికి కాపలా చాలా కట్టుదిట్టంగా ఉంటుంది. గేటు తలుపులకు తాళంవేసి కాపలా పెట్టారు తుపాకీతో.

కొమరయ్యవంటి బాలనేరస్థులు పాతికమంది వరకూ ఉన్నారక్కడ. చదువుకున్న ఖైదీని ఈ నేరస్థులకు చదువు నేర్పడానికి పెట్టారు. కొమరయ్య మాటలు రాయటం, వాక్యాలు చదవటం నేర్చుకుంటాడు.

బాలనేరస్థులకు ప్రత్యేక పాఠశాల, దానికనుబంధంగా వసతిగృహంకూడా

ఉన్నాయి. కొమరయ్యకు దానిలో చేర్పించినప్పటినుంచీ చురుకుదన మెక్కు-వయింది. పాటలూ, పద్యాలూ నేర్చుకుంటున్నాడు. చదువుతోపాటు వృత్తివిద్య-లలో వడ్రంగి చేతికింద పనికూడా నేర్చుకుంటున్నాడు.

కొమరయ్య కంఠం బాగుంటుంది. బాల్యంలో పల్లెపదాలు పాడుతూ ఉంటే తోటివాళ్ళంతా అతడి చుట్టూ చేరేవాళ్ళు. ఇప్పుడు పాటలూ పద్యాలూ టీచరు దగ్గర నేర్చుకుని పాడుతూఉంటే స్కూలు పిల్లలంతా చుట్టూ చేరుతున్నారు. టీచర్లు పాఠశాల వార్షికోత్సవాలలోనూ సభలలోనూ అతడి సంగీత ప్రోగ్రాములు ఏర్పాటు చేసేవారు. హెడ్‌మాస్టరు అతడికి శాస్త్రీయసంగీతం నేర్చుకునే ఏర్పాటు కూడా చేశారు.

కొమరయ్యకు ఈ పాఠశాల చాలా నచ్చింది. చదువుతో పాటు అక్కడ నేర్పించేవన్నీ చురుకుగా నేర్చుకుంటున్నాడు. ఒంటినిండా బట్ట, కడుపునిండా భోజనం ఉత్తమ పౌరుడికి అవసరమైన వ్యాసంగం అతడికి చాలా సుఖంగా సంతోషంగా ఉంది.

కొమరయ్యకు తన వయసెంతో తెలియదు. ఏడవ తరగతి పరీక్షవ్రాసే సరికి సుమారు పదహారేళ్ళని అధికారులు రాసుకున్నారు. ఒకసారి పరీక్ష పోయినప్పటికీ రెండోసారి బాగా రాశాడు. వడ్రంగంలో స్వయంగా చిన్నచిన్న బల్లలూ పీటలు చెయ్యటం నేర్చుకున్నాడు. పెద్ద వస్తువులు తయారు చెయ్యటంలో శిక్షణ పొందుతున్నాడు.

అప్పటికి ఎనిమిది సంవత్సరాల కాలం జరిగిపోయింది. కొమరయ్య, తల్లి జ్ఞాపకం వచ్చినప్పుడు కంట తడిపెడతాడు. శకుంతలకు ఇష్టంలేకపోయినా భాస్కరరావుగారు వచ్చి తన్ను పలకరించగూడదా అనుకుంటాడు. తన తల్లీ, భాస్కరరావుగార్లతో తన సంతోషాన్ని పంచుకోవాలన్న ఆరాటం మనసును కలవర పెడుతూ ఉంటుంది. సాధ్యం కాదేమోనన్న నిరాశ కలుగుతూ ఉంటుంది.

కాని, అసలు జరిగిన విషయం అతడికెలా తెలుస్తుంది?

పోలీసు ఇన్‌స్పెక్టరుతో ఫోనులో భాస్కరరావు కొమరయ్యను గురించి వాకబు చేస్తున్నాడు. అతడు వెళ్ళిపోయినప్పటినుంచీ, కొన్ని రోజులపాటు స్వయంగా వెళ్ళి కనుక్కున్నాడు. ఒకనాడు పోలీసుస్టేషన్ నుంచి ఫోను వచ్చింది,

కొమరయ్యను బాలనేరస్థుల పాఠశాలలో చేర్చారని, అతడికి చాలా బాధకలిగింది. హాస్పిటల్లో చేరినవాడు ఎక్కడికి వెళ్ళి దొంగతనం చేశాడు ? ఒకవేళ, దొంగతనం చేసి పట్టుబడి, బాలనేరస్థుడై పాఠశాలలో చదువుతున్నాడేమో? ఇదంతా శకుంతల వల్ల జరిగిన పని. జ్వరం వచ్చిన పిల్లవాడిని స్కూలుకు పంపించటమేమిటి అహంకారం కాకపోతే ? వాడు మనిషికాడా ? జబ్బు చెయ్యదా ? మనసులో బాధ కళ పెళ్ళాడింది.

భాస్కర్రావు ఆగలేక ఒకనాడు పాఠశాలకు వెళ్ళి హెడ్‌మాస్టర్ని కలుసుకుని కొమరయ్య సంగతి అడిగాడు.

ఆయన వివరంగా చెప్పి "పిల్లవాడు చురుకైనవాడు, బాగా చదువుతున్నాడు. వృత్తివిద్యలు కూడా ఇక్కడ నేర్పుతారు. పదవక్లాసు అయ్యేవరకూ ఇక్కడే ఉంచుతారు. అప్పటికి వృత్తివిద్యలో ఆరితేర్తాడు. కనుక ఏదయినా వృత్తి చేసుకుంటూ బతకవచ్చు. వడ్రంగం నేర్చుకుంటున్నాడు కనుక స్వంత వ్యాపారం పెట్టుకోవచ్చు, మంచి భవిష్యత్తు ఉంటుంది. మీరు అతడిని చూస్తారా ? రండి" అంటూ అతడి క్లాసుకు తీసుకు వెళ్ళాడు.

భాస్కర్రావు అతడిని చూడగానే పలకరించలేక పోయాడు. కంఠం బిగిసినట్లయింది, తల భూమిలోకి దిగిపోతున్నట్టనిపించింది.

"కొమరయ్యా వీరు భాస్కర్రావుగారు. నీకు వీరు తెలుసా ?"

కొమరయ్య అపరాధిలా తలవంచుకుని ''తెలుసు'' అన్నాడు.

అతి ప్రయత్నం మీద భాస్కర్రావు ''బాగున్నావా కొమరయ్యా" అన్నాడు.

తల ఊపాడు కొమరయ్య.

''బాగా చదువుకో, పనినేర్చుకో వృద్ధిలోకి వస్తావు. జరిగినదంతా పీడకల అనుకుని మర్చిపో" భుజం తట్టి తల నిమిరాడు.

ఆ రాత్రి అతడికి నిద్ర సరిగా పట్టలేదు. కొమరయ్యను గురించిన ఆలోచనలు చుట్టుముట్టాయి. కొమరయ్య బాగా పొడుగయ్యాడు, దృఢకాయుడయ్యాడు. వెనుకటిరంగు విచ్చి ఛాయవచ్చింది. ముఖానికి అందం వచ్చింది.

హెడ్‌మాస్టరు చెప్పినట్లు పదవక్లాసు అయిన తరువాత ఫర్నిచరు షాపు పెట్టుకుని గౌరవంగా బతుకుతాడు.

తల్లి దగ్గర ఉన్నా తన దగ్గర ఉన్నా అతడికి అభివృద్ధి కలుగుతుందా ?

కలగదు, అప్పు తీర్చటానికి చిన్నప్పటినుంచీ పనిచేస్తూ దెబ్బలు తింటూ నౌకరుగానే బతుకుతాడు తీరని బాకీ కోసం.

భాస్కరరావు అయిదారునెలల నుంచీ డబ్బు పంపటం లేదు. కొమరయ్య తల్లి రాజుగారు అడిగినప్పుడల్లా "నేనక్కడికి ఒకసారి పోయివస్తాను. డబ్బు తీసుకువస్తానని" చెప్తోంది. ఆమెకూ అనుమానంగానే ఉంది. నెల నెలకూ వచ్చే డబ్బు రాకపోవటంతో, ఒకనాడు బయలుదేరి రానే వచ్చింది.

శకుంతలను చూడగానే "బాగున్నారా అమ్మగారూ ?" అంటూ పలకరించింది. కొమరయ్యకోసం కళ్ళతో ఇటూ అటూ వెతికింది.

అంతలో భాస్కరరావు 'ఎవరూ ?' అంటూ గదిలోనుంచి బైటికి వచ్చి బాలమ్మను గుర్తుపట్టి, "నేను రాసిన ఉత్తరాలు చేరలేదా ? వరసగా నాలుగు రాశాను'' అన్నాడు.

"ఉత్తరాలు రాశారా బాబయ్యా ? నాకు చదువురాదు. రాజుగారింట్లో ఎవరయినా చించిపడేశారేమో ?'' తనలో తను అనుకున్నట్టుగా గొణిగింది బాలమ్మ.

''అవును బాలమ్మా, నాలుగు రాశాను. కొమరయ్య ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు. పోలీసు రిపోర్టుకూడా ఇచ్చాను. వెతుకుతున్నా మన్నారు."

''అయ్యో నాయనా, కొమరయ్యా ఎటుపోయావురా తండ్రీ'' బాలమ్మ నేల మీద దొర్లిదొర్లి ఏడవటం మొదలుపెట్టింది.

''ఏడవకు బాలమ్మా! ఏడ్చి ఏం చెయ్యగలవు ? నేను పోలీసుస్టేషనులో రోజూ కనుక్కుంటూనే ఉన్నా. మళ్ళీ రేపు వెళ్ళి అడిగివస్తాను" ఆమెను ఓదార్చటానికి ప్రయత్నించాడు.

బాలమ్మ దుఃఖాన్ని ఆపుకోలేక పోతున్నది. నిద్రాహారాలు లేకుండా ఏడుస్తున్నది.

శకుంతలకు పిచ్చెక్కినట్టుగా ఉంది. భాస్కర్రావుకు అయోమయంగా ఉంది.

మరునాడు భాస్కర్రావు ఆఫీసునుంచి రాగానే, బాలమ్మ ఎదురుగా వచ్చి "కొమరయ్య సంగతి తెలిసిందా బాబయ్యా ?'' అంటూ ప్రశ్నించింది.

"కనబడలేదుగాని సంగతి తెలిసింది" మెల్లగా ఒక్కొక్కమాటే ఆగి ఆగి అన్నాడు.

"నా కొడుకు, నా కొమరయ్య సంగతి ఏమని చెప్పాడు బాబయ్యా ?'' సంభ్రమంతో అడిగింది బాలమ్మ.

"నీతో ఎలా చెప్పనా అని ఆలోచిస్తున్నాను. కొమరయ్య మనలోకంలో లేడట'' తలవంచుకుని మెల్లగా అన్నాడు.

"నా కొడుకు చచ్చిపోయాడా ? నిజమేనా బాబయ్యా ? నేనేం చెయ్యనురా నాయనా. ఇంటికెట్లా వెళ్ళను ? రాజుగారి బాకీ తీరేదెట్లా ? నా ప్రాణం కూడా పోతే బాగుండు తండ్రీ. నన్నుకూడా తీసుకుపో దేవుడా నేను బతకలేనింక" బాలమ్మ గోడు గోడున ఏడుస్తున్నది. తలబాదుకుంటున్నది.

ఆమె ఏడుపుకు భాస్కర్రావుకు కన్నీళ్లొచ్చాయి. అతడు ఆమె బాధను చూడనూ లేడు. అట్లాఅని నిజం చెప్పనూ లేడు. నిజం చెబితే కొమరయ్యకు పతనమే. బలవంతంగా ఇంటికి తీసుకుపోయి రాజుగారికి ఒప్పచెప్తుంది.

''బాలమ్మా నీ విట్లా ఎన్నిరోజులు ఏడ్చినా కొమరయ్య తిరిగిరాడు. వాడు చచ్చిపోయినట్టు నీవు కూడా చస్తేగాని మీ రాజుగారి బాకీ తీరదు" అన్నాడు తెగించి.

''అట్లా.... జరిగినా బాగుండు బాబయ్యా" కుమిలి కుమిలి ఏడుస్తు అన్నది బాలమ్మ.

"బాలమ్మా, నీవు రైలు కిందపడి చచ్చిపో. ఆమాట నేను రాజుగారికి

ఉత్తరం రాస్తాను. చచ్చిపో లేకపోతే పారిపో. ఏదో ఒకటి చెయ్యి మనసు గట్టి చేసుకుని. అదే నేను చెప్పగలిగిన మాట".

భాస్కర్రావు ఆ మాటలంటుంటే అతడి కళ్ళ ముందర ఆరోగ్యంతో నిగ నిగలాడుతూ, ఏపుగా పెరిగిన కొమరయ్య, డ్రెస్సులో హుందాగా నిలబడి, చిరు నవ్వులు చిందిస్తున్నాడు, మిల మిలా మెరిసే తన భవిష్యత్తును కళ్ళతో చూపిస్తూ.